సాయిబాబా ఆలయంలో రాచకొండ పోలీస్ కమిషనర్ పూజలు

ఎల్బీనగర్, మార్చి 14 : దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయంలో గురువారం రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్బీనగర్ జోన్ పోలీస్ అధికారులతో కలిసి దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయాన్ని సందర్శించిన కమిషనర్ బాబాను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ట్రస్టు చైర్మన్ గుండ మల్లయ్య కమిషనర్ తరుణ్‌జోషితోపాటు పోలీస్ ఉన్నతాధికారులను సన్మానించి సాయిబాబా చిత్రపటాన్ని అందజేశారు.

సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ తనిఖీ

రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి గురువారం సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల అదుపునకు తగిన చర్యలు తీసుకోవాలని, లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సిబ్బంది సన్నద్ధం కావాలన్నారు. ఆయన వెంట ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ కృష్ణయ్య, సీఐ సైదిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్డీఓకు సన్మానం



ఆర్‌డీఓ సూరజ్‌కుమార్‌ను గురువారం ఆయన కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ సరిత మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆర్డీఓ గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలనను అడిగి తెలుసుకున్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీఓకు సూచించారు.

– కందుకూరు. మార్చి 14

బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయాలి

- మాజీ సీఎం కేసీఆర్ ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని కాపాడారు..
- పార్టీ మీర్‌పేట మహిళా విభాగం సమావేశంలో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

మీర్‌పేట మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎన్నికైన సునీతకు నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, మార్చి 14 : బీఆర్ఎస్‌కు మహిళలంతా అండగా ఉండి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ డివిజన్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా జమాల్‌పూర్ సునీతా బాల్‌రాజ్ ఎన్నికైన సందర్భంగా గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి ఇంటికీ తాగునీరందించారని అన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించడానికి కల్యాణలక్ష్మి పథకం ప్రవేశపెట్టారని కొనియాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే ఔటర్‌రింగ్ రోడ్డు లోపల ఉన్న గ్రామాలకు తాగునీటి కోసం రూ. 1250 కోట్లు కేటాయించారన్నారు. కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలతో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధించిందన్నారు. కేసీఆర్ కిట్‌తో ఎంతో మేలు జరిగిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చి వారి ఆత్మగౌరవాన్ని కాపాడారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరాయని గుర్తుచేశారు. సాధించుకున్న తెలంగాణను ఏ విధంగా అభివృద్ధి చేయాలో కేసీఆర్ విజన్‌తో పనిచేసి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందంజలోకి తీసుకువచ్చారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు ఎందుకు అందడంలేదో? ఆ పార్టీ నాయకులను నిలదీయాలన్నారు. ప్రజలకు తప్పుడు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్కటి కూడా అమలు చేయడం లేదన్నారు.

బీఆర్ఎస్ మీర్‌పేట మహిళా విభాగం అధ్యక్షురాలిగా సునీత

అనంతరం బీఆర్ఎస్ పార్టీ మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎన్నికైన జమలాపుర్ సునీతకు ఎమ్మెల్యే నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్ ఆదేశాల మేరకు పార్టీ బలోపేతం చేస్తున్నామన్నారు. సునీత మాట్లాడుతూ నాయకులు, కార్తకర్తలను సమన్వయం చేస్తూ పార్టీ నిర్మాణంపై దృష్టి సారిస్తానన్నారు.

ఆ తర్వాత ఎమ్మెల్యే మండలంలోని మన్‌సాన్‌పల్లిలో రేణుకా ఎల్లమ్మ బోనాల జాతరలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, కార్పొరేటర్ లావణ్యాబీరప్ప, ధనలక్ష్మీరాజ్‌కుమార్, రాజేందర్‌రెడ్డి, అంజయ్య, పార్టీ ప్రధాన కార్యదర్శి భూపేశ్‌గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనూనాయక్, యూత్ అధ్యక్షుడు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన లేకనే కిడ్నీ వ్యాధులు

అవేర్ ఆసుపత్రిలో మాట్లాడుతున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి, చిత్రంలో ఆసుపత్రి సీఓఓ కరుణాకర్‌రెడ్డి

ఎల్బీనగర్ , మార్చి 14 : ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతోనే కిడ్నీ వ్యాధు బారిన పడుతున్నారని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ డీ. రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం లింగోజిగూడలోని గ్లేనిగల్స్ అవేర్ ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహన సదస్సులో కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మూత్రశాలలు సరిగా అందుబాటులో లేకపోవడం కూడా కిడ్నీ వ్యాధులకు కారణమన్నారు. ధూమపానం, మద్యపానం వల్ల కిడ్నీలు చెడిపోతున్నాయని, తగిన పరీక్షలు చేయించుకుని కిడ్నీలను జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. ఆసుపత్రి సీఓఓ కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో రోగులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుత సమాజంలో వయసుతో సంబంధం లేకుండా కిడ్నీ సమస్యలు వస్తున్నాయన్నారు. డాక్టర్లు నవీన్‌కుమార్, డాక్టర్ వేణు, డాక్టర్ ప్రభు చరణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ సమస్యలపై అవగాహన పెంచుకోవాలి

మన్సూరాబాద్ : కిడ్నీ సమస్యలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని డాక్టర్ ఏ. సంతోష్‌కుమార్ సూచించారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం ఎల్బీనగర్ కామినేని దవాఖాన ఆధ్వర్యంలో రాఘవేంద్రకాలనీలో సీనియర్ సిటిజన్స్ సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై ప్రసంగించారు. పెద్ద వయసులో కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవడం ఎలా? అన్న అంశంపై డాక్టర్ ఏ. సంతోష్‌కుమార్ వివరించారు. మార్చి 14 నుంచి ఏప్రిల్ 30 వరకు కిడ్నీ పరీక్షలపై ప్రత్యేక ప్యాకేజీని అందిస్తున్నట్లు తెలిపారు.

కిడ్నీ పరీక్షల ప్రత్యేక ప్యాకేజీని విడుదల చేస్తున్న డాక్టర్ సంతోష్‌కుమార్, తదితరులు

యువకుడు ఆత్మహత్య

కందుకూరు. మార్చి 14 : ఒరిస్సాకు చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఒరిస్సా రాష్ట్రం నుపాడ జిల్లా కొత్తిపాడ గ్రామానికి చెందిన బిష్ణు మజిహీ(27) మూడు నెలల క్రితం జీవానోపాధి కోసం మండలంలోని రాచులూరు గ్రామానికి వలస వచ్చి అక్క జయ మజిహీ కుటుంబం వద్ద ఉంటూ ఇటుక బట్టిల్లో పని చేస్తున్నాడు. తాగుడుకు బానిస కావడంతో రాత్రి భోజనం చేస్తున్న సమయంలో అతడి అక్క మద్యం మానివేయాలని మందలించింది. దీంతో అతడు కోపంతో వెళ్లి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత కుటుంబసభ్యులు వెతకగా చెట్టుకు విగత జీవుడై కన్పించాడు.

కందుకూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ మక్బూల్‌జానీ శవాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ

చాదర్‌ఘాట్, మార్చి 14: నిరుపేదలను అన్ని విధాలా ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని ఎంబీటీ పార్టీ అధికార ప్రతినిధి, మాజీ కార్పొరేటర్ అమ్జాదుల్లాఖాన్ అన్నారు. రెయిన్‌బజార్ ఎంబీటీ పార్టీ నేత అబ్దుల్‌రెహమాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దాదాపు 5 వేల రేషన్ కిట్లను అమ్జాదుల్లాఖాన్ నిరుపేదలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పవిత్ర మాసంలో నిరుపేద ముస్లింలకు నిత్యావసర వస్తువులను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ఎంబీటీ పార్టీ యువజన నాయకుడు అఫనుల్లాఖాన్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన

కమలానగర్‌లో మాట్లాడుతున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, పాల్గొన్న పోలీస్ అధికారులు, నాయకులు

హయత్‌నగర్,మార్చి 14 : ఒక్క సీసీ కెమెరా వంద మంది నేత్రాలతో సమానమని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. గురువారం కమలానగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఆవశ్యకతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రజల రక్షణకు, దొంగతనాల నివారణకు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు, అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని వివరించారు. కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎంపీ నిధులు మంజూరయ్యాయని, కాలనీవాసుల సహకారంతో వాటిని త్వరలోనే ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ఏడుకొండలు, కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పాదచారులు స్కైవాక్‌ను వినియోగించుకోవాలి

ఉప్పల్, మార్చి 14 : ఉప్పల్ రింగ్‌రోడ్డులో రోడ్డును దాటే పాదచారులు స్కైవాక్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఉప్పల్ ట్రాఫిక్ సీఐ ఈ.వెంకట్‌రెడ్డి సూచించారు. ఉప్పల్ రింగ్‌రోడ్డులో గురువారం ప్రయాణికులకుఅవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధాన రోడ్డు క్రాస్ చేయకుండా డివైడర్లను ఏర్పాటు చేశారు. ఆ పనులను సీఐ పరిశీలించారు. పాదచారులకు అవగాహన కల్పించేందుకు హెచ్ఎండీఏ, మెట్రోరైల్ అధికారులు సహకరించాలని కోరామన్నారు. ట్రాఫిక్ ఎస్సై చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రిటైర్డ్ ప్రొఫెసర్ గణేశ్

ఆర్కేపురం, మార్చి 14 : విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని రిటైర్డ్ ప్రొఫెసర్ సి.గణేశ్ అన్నారు. యువతలో 'పెరుగుతున్న హింసాత్మక పరిణామాలు–పరిష్కారాలు' అనే అంశంపై నక్క వెంకటేశ్ అధ్యక్షతన కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ప్రొఫెసర్ సి.గణేశ్‌తోపాటు ప్రొఫెసర్ జీబీ రెడ్డి, అడిషనల్ ఎస్సీ టి.తిరుపతిరెడ్డి, విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ పెరిక యాదయ్య హాజరై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు సోషల్ మీడియా ప్రభావం వల్ల ఎక్కువగా చెడిపోతున్నారని అన్నారు. యువతసరైన మార్గంలో ప్రయాణించాలంటే క్రమశిక్షణ, చిత్తశుద్ధి, పట్టుదల చాలా ముఖ్యమని విద్యార్థులకు సూచించారు. సరైన మార్గాన్ని ఎంచుకొని తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గట్టుమల్లు, డాకర్ ఎన్‌వీ శివాజీ, అశోక్‌యాదవ్, నాగరాజ్, శంకర్, సతీశ్, వినయ్, వివిధ హాస్టళ్ల విద్యార్థులు పాల్గొన్నారు.

మినీ ఎయిర్‌టెక్ వాహనం ప్రారంభం

మినీ ఎయిర్‌టెక్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ అరుణ, జలమండలి అధికారులు

సైదాబాద్, మార్చి 14 : సైదాబాద్ జలమండలి సెక్షన్‌కు నూతనంగా మంజూరైన మినీ ఎయిర్‌టెక్ వాహనాన్ని గురువారం మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, సైదాబాద్ కార్పొరేటర్ అరుణ, జలమండలి అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ సైదాబాద్ డివిజన్‌లో మురుగునీటి కష్టాలను సత్వరమే తొలగించడానికి ఈ వాహనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం షీలా రాణి, సైదాబాద్ సెక్షన్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, మనోహర్, శ్రీనివాస్, ఎంఐఎం, బీజేపీ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

హయత్‌నగర్, మార్చి 14 : అర్హులైన ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోత్స్న ప్రభ సూచించారు. కేంద్ర ప్రభుత్వం, క్రీడా, యువజన శాఖ ఆధ్వర్యంలో 'మేరా పెహలా ఓట్ దేశ్‌ఖేలీయే' కార్యక్రమాన్ని గురువారం హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోత్స్నప్రభ అధ్యక్షతన నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఇన్‌చార్జి,డాక్టర్ ఎస్‌కే జాహేదా బేగం నేతృత్వంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఓటర్ల ప్రతిజ్ఞ, సెల్ఫీ విత్ ఓటర్స్ లోగో, రీల్స్ ఆన్ ఓటర్స్ అవేర్‌నెస్, ఓటు విశిష్టతపై పాటలు, ఉపన్యాసాలు, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీలను 'మై గావ్' వెబ్‌సైట్‌లో నిక్షిప్తపరిచారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డి, ఐక్యూఏసీ డాక్టర్ ఇంతియాజుద్దీన్ ఫారూఖీ, డాక్టర్ ధన్‌రాజ్, సత్యనారాయణ, డాక్టర్ ఏలేందర్, డాక్టర్ ఆదాము, సిబ్బంది పాల్గొన్నారు.

మారుతీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం

కొత్తపేట మారుతీనగర్‌లో రెడీటూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముత్తూట్ ఫౌండేషన్ సహకారంతో గురువారం జైన్ మందిర్ వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి మంచి స్పందన లభించింది. కార్యక్రమంలో ఫౌండేషన్ యువత కమిటీ అధ్యక్షుడు శివనేత, నాయకులు యశ్పాల్ గౌడ్, కిరణ్‌కుమార్, కాలనీ అధ్యక్షుడు మల్లేశం, సుభాశ్, దాసు, రాజేందర్, వెంకటేశ్, రఘు, సుధీర్ పాల్గొన్నారు.

– ఎల్బీనగర్, మార్చి 14

పద్మశాలీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు అభినందనీయం

మన్సూరాబాద్, మార్చి 14: కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న పద్మశాలీల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పద్మశాలీ సంఘం మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు గంజి వెంకటేశం నేత అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి కాస్మోపాలిటన్ కాలనీలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారిగా పద్మశాలి కార్పొరేషన్‌ను ప్రకటించగా మంత్రి మండలి మద్దతు తెలపడం సంతోషకరమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రిమండలి సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట సంఘం ప్రధానకార్యదర్శి సత్యనారాయణ నేత, లక్ష్మీనర్సింహా నేత ఉన్నారు.

వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు అభినందనీయం

సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

ఆర్కేపురం, మార్చి 14 : కాంగ్రెస్ ప్రభుత్వం వైశ్యుల సంక్షేమానికి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు టీ. వెంకటేశం అన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం హరిపురి కాలనీలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైశ్య కార్పొరేషన్ ఏర్పాటుతో పేద వైశ్యులకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, గందె సురేశ్, కిరణ్‌కుమార్, దామోదర్, సుభాకర్‌రావు,సురేందర్, వేణుకుమార్, కవిత, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం

కొత్తపేటలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

ఎల్బీనగర్ , మార్చి 14 : కొత్తపేట డివిజన్‌లో పాత డ్రైనేజీల స్థానంలో నూతన పైప్‌లైన్ నిర్మించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. రూ. 7 లక్షలతో కొత్తపేట గ్రామంతో పాటు మోహన్‌నగర్ కమర్షియల్ టాక్స్ కాలనీలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ నూతన పైప్‌లైన్ పనులను గురువారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగునీరు రోడ్లపై వెళ్లకుండా కొత్త పైప్‌లైన్ వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమర్షియల్ టాక్స్ కాలనీ అధ్యక్షుడు అంజయ్య గౌడ్, విశ్వేశ్వర్ రావు, సురేందర్, నాయకులు సుందర్‌నారాయణ, అశ్విన్‌సింగ్, తిరుమల్, మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.

సింగరేణి గుడిసెల్లో తాగునీటికి కటకట

- పట్టించుకొని జలమండలి అధికారులు, ప్రజాప్రతినిధులు
- ట్యాంకర్లతో నీటి సరఫరా ఇంకెన్నాళ్లంటూ పేదల ఆవేదన



సింగరేణికాలనీలో ట్యాంకర్ వద్ద తాగునీరు కోసం పోటీ పడుతున్న మహిళలు, చిన్నారులు

సైదాబాద్, మార్చి 14: వేసవిలో సింగరేణికాలనీలో తాగునీటికి గుడిసెవాసులు అష్టకష్టాలు పడుతున్నారు. ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణికాలనీలో తాగునీటి నల్లా కనెక్షన్లు లేకపోవడంతో ప్రజలంతా ట్యాంకర్ల నీటిపైనే ఆధారపడుతున్నారు. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే చాలీచాలని తాగునీటితీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా 20 ఏండ్లకు పైగా గుడిసెలు వేసుకొని జీవిస్తున్న పేదలకు వ్యక్తిగత, పబ్లిక్ నాల్లా కనెక్షన్లు లేకపోవడంతో నాటినుంచి ట్యాంకర్లపై ఆధారపడి జీవిస్తున్నారు. తాగునీరు లేక దూరప్రాంతాలకు వెళ్లి నీటి తెచ్చుకుంటున్నారు. కుటుంబ అవసరాలకు బోర్ల నుంచి నీరు తెచ్చుకుంటున్నప్పటికీ, తాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో పడరాని పాట్లు పడుతున్నారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా ఇంకెన్నాళ్లు..

సింగరేణి కాలనీలో గుడిసెల్లో జీవిస్తున్న 15 కుటుంబాలకు అధికారులు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. రోజు విడిచి రోజు తాగునీటి ట్యాంకర్ వచ్చిందంటే నీటి కోసం మహిళలు యుద్ధం చేయాల్సి వస్తున్నది. మరికొంతమంది గుడిసెల వద్ద ఏర్పాటు చేసుకొన్న డ్రమ్ముల్లో నీరు నింపుతున్నారు. ఆవి కూడా కుటుంబానికి ఒకే డ్రమ్ము ఇవ్వడంతో అవి ఏలా సరిపోతాయని వారు ప్రశ్నిస్తున్నారు. తమ తాగునీటి కష్టాలను అనేకమార్లు జలమండలి అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవటంలేదని పేదలు ఆరోపిస్తున్నారు.

తాగునీటి పైపులైన్లు వేయాలి

సింగరేణికాలనీ గుడిసెల్లో తాగునీటి పైప్‌లైన్లు వేసి, నల్లాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అదేవిధంగా ట్యాంకర్ల సంఖ్యను పెంచి డ్రమ్ముల్లో సైతం నీటిని నింపాలని పేదలు కోరుతున్నారు.

కల్లుగీత సహకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

కుషాయిగూడ కల్లుగీత సహకార సంఘం సభ్యులను సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

చర్లపల్లి, మార్చి 14 : చర్లపల్లి డివిజన్ కుషాయిగూడ కల్లుగీత సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. కుషాయిగూడ కల్లుగీత సహకార సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా పనగట్ల రామారాజుగౌడ్, కాసుల సురేశ్‌గౌడ్‌లు ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యకులుగా బుడంపల్లి వెంకటేశ్‌గౌడ్, డైరక్టర్లుగా పంజాల బాబు గౌడ్, లింగాల సత్యనారాయణగౌడ్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు రామారాజు గౌడ్, సురేశ్‌గౌడ్‌లు మాట్లాడుతూ కలుగీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు రవీందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, అంజనేయులుగౌడ్, ఆశోక్‌గౌడ్, నర్సింహ గౌడ్, ముత్యాలుగౌడ్, పాల్గొన్నారు.

మీర్‌పేట్ డివిజన్‌లో..

మల్లాపూర్: మీర్‌పేట్ డివిజన్ గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షునిగా దుబ్బాకుల నర్సింగ్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా టి. శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా దంతూరి రాజు గౌడ్, డైరెక్టర్లు ఎ. రాజుగౌడ్, బి. రాజుగౌడ్‌ను ఎన్నుకున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా..

ఘట్‌కేసర్,మార్చి14: ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు ప్రభుత్వ భవనాలను ఏర్పా టు చేస్తున్నట్లు పోచారం చైర్మన్ బి.కొండల్‌రెడ్డి అన్నారు. 3వ వార్డు యంనంపేట్ వీకర్‌సెక్షన్ కాలనీలో మున్సిపాలిటీ నిధులు రూ.35లక్షలతో నిర్మించిన కమ్యూనిటీహాల్ భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రజలకు మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ రెడ్డ్యానాయక్, కమిషనర్ వేమన రెడ్డె, స్థానిక కౌన్సిలర్ రాజశేఖర్, బీఆర్ఎస్ నాయకులు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందును విజయవంతం చేయాలి

కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నేత సమీరుల్లాతో నాయకులు

చాదర్‌ఘాట్, మార్చి 14: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో లాల్‌బహదూర్ స్టేడియంలో శుక్రవారం ఏర్పాటు చేయనున్న ఇఫ్తార్ విందును విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు సమీరుల్లా అన్నారు. కాంగ్రెస్ పార్టీ మలక్‌పేట నియోజకవర్గ ఏ, బీ బ్లాక్, డివిజన్ అధ్యక్షులతో గురువారం సమీరుల్లా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఫ్తార్ విందులో అన్ని ప్రాంతాల మసీదు కమిటీ సభ్యులు, దేవాలయాల కమిటీ సభ్యులు, పార్టీల నాయకులు, కార్యకర